ఈనాడు ఆదివారం: 8-7-2001

# వర్షించని మేఘం...

మా ఆవిడ డాక్టరు. అయితేనేం, గుళ్ళూ, గోపురాలు, తీర్థయాత్రలు, యాగాలు, యజ్ఞాలు, సాధువులు, వేదాంతులు... ఆమె వృత్తి వేరు... ప్రవృత్తి వేరు... ఆమెను చూసిన వాళ్ళు డాక్టరని చెబితేగాని నమ్మరు.

మా ఆవిడ పోరుపడలేక, అమరావతి వెళ్ళాం. కృష్ణానదిలో స్నానం, ఆ తరువాత అమరలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం అయి తీరిగ్గా మండపంలో కూర్చుని దూరంగా

కనపడే లంకలు, ఇసుక తిన్నెలు, అడపా దడపా చీమల్లాగా సాగే గూడు పడవలు చూస్తూ చల్లటిగాలి హాయిగా అనుభవిస్తుంటే.....

గుళ్ళో పూజారి మాటల సందర్భంలో...

"ఈ ఊళ్ళో మీ ఇంటిపేరుగల ఒకాయన.... ఆంజనేయులు ఉన్నాడండీ!" అన్నాడు.

నాకు మా బంధువుల వివరాలు, సంబంధ బాంధవ్యాలు, చుట్టరికాలు అట్టే తెలియవు. ఎందుకంటే, నా చిన్నప్పుడే, మా నాన్న ఉద్యోగరీత్యా ఊళ్ళు పట్టుకు తిరగడం, ఆ తరవాత నా చదువంతా హైదరాబాద్‌లో జరగడం, వివాహం కూడా అక్కడే కావడం, ఆవిడదీ హైదరాబాదు అవడం, ఆవిడ ప్రాక్టీసుకీ, నా వ్యాపారానికీ హైదరాబాద్ కేంద్రంగా ఉండడం... ఇవన్నీ కారణాలు.

మా ఆవిడ, నా తరపు చుట్టాలు అక్కడ ఉన్నారని వినగానే మహా సంతోషపడింది.

"చెప్పారు కాదూ! ఆయన్ను పిలిపించండి ఓసారి. మా వారి పుట్టుపూర్వోత్తరాలూ, మా అత్తవారి బంధుగణం విశేషాలూ తెలుసుకోవచ్చు" అంది ఉత్సాహంగా.

నాకు ఇష్టం లేదు. ఏదో చుట్టరికాలు పేరిట ఎవరెవరో రావడం, 'మా అబ్బాయికీ ఉద్యోగం చూడండి', 'మా ఆవిడ అనారోగ్యం మనిషి. అక్కడ మంచి వైద్య సదుపాయాలుంటాయి. మీరు సాయం చెయ్యాలి', 'మా అమ్మాయికి పెళ్ళి డబ్బు సాయం చెయ్యండి..' ఇలా బంధువులు ఈగల్లా ముసరడం నాకు ఇష్టం లేదు.

మా ఆవిడ మాట కాదంటే చిన్నపిల్లలా మూతి ముడుచుకుని రెండ్రోజులు అలుగుతుంది. పేరుకు డాక్టరేగానీ ఆ హోదా, దర్పం, ఏవీ లేవు. ఆమె రోగులు చెప్పే కథలు నిజమని నమ్ముతుంది. మందులు ఉచితంగా ఇవ్వడమే కాకుండా ఫీజూ అడగదు. రోజంతా రోగులు వస్తుంటారు. ఆవిడకు క్షణం తీరికుండదు. ఆదాయమూ లేదు. అంత జాలి గుండెకలది డాక్టరవడమే విచిత్రం. దేనికీ తట్టుకోలేదు. ఓర్చుకోలేదు.

ఆవిడ మాట కాదనలేక, చుట్టపాయన కోసం బయలుదేరక తప్పలేదు. పూజారి, ఓ కుర్రాడిని మా వెంట పంపాడు.

కారులో మా ఆవిడ, నేను, ఆ కుర్రాడు బయలుదేరాం - ఇల్లు వెతుక్కుంటూ.

ఆనవాళ్ళు లేని దుమ్ము రోడ్లు, శిథిలమవుతున్న పెంకుటిళ్ళు. మట్టి మిద్దెలు, అటు ఇటూ తిరిగే ఆడామగా.. ఇళ్ళ ముందు మురుగు కాలవలు, పందులు, కుక్కలు, మట్టిలో ఆడుకుంటున్న పిల్లలు - ఇవన్నీ చూస్తూ సందులూ గొందులూ తిరిగి ఓ డాబా ముందు ఆగాం.

అరుబయట, గచ్చు మీద, కందులు ఎండబోసి ఉన్నాయి.

కారు ఆగిన శబ్దం, ఆ కారు వెనుక వచ్చిన పిల్లగుంపు కేకలకు, ఆ డాబా లోంచి, ఓ ఆవిడ బయటికొచ్చింది.

మా వెంట వచ్చిన కుర్రాడు కారు దిగి- "ఆంజనేయులుగారున్నారా? మీ చుట్టాలుట

వచ్చారు" అని ఆ వీధంతా వినపడేలా కేక పెట్టాడు.

కారునీ, ఆ కారులో ఉన్న మమ్మల్నీ ఆ చుట్టుపక్కల ఇళ్ళల్లోని వాళ్ళు వింతగా చూడడం నాకు అదోలా అనిపించింది.

అప్పటికే మా ఆవిడ కారు దిగి, గేటు తీసుకుని, "మేం లోపలకు రావచ్చా" అని ఓ క్షణం ఇంటావిడను పరీక్షగా చూసి, "అయ్యో! మీకు చూపులేదా!" అని ఆశ్చర్యపోయి, జాలిపడి -

"మీరు మాకు మర్యాదలేం చెయ్యొద్దు. వరండాలో బల్ల మీద కూర్చుంటాం" అని, "కారు లాక్ చేసి రండి" అని నాకు అర్డరు వేసింది.

నేను, కారు అద్దాలు మూసి, కారు లాక్ చేశా. మా వెంట వచ్చిన కుర్రాడు ఆ లోపల వెళ్ళిపోయాడు ఎటో!

నేనూ ఆవిడతో వెళ్ళి, బల్ల మీద కూర్చున్నా.

"మా వారూ, మీ వారూ బంధువులట! అందుకే వచ్చాం, చూసిపోదామని. మీరు ఇలా రండి" అని మా ఆవిడ ఆ అంజనేయులు భార్యని వెలుతుర్లోకి తీసుకుపోయి కళ్ళు పరీక్ష చేసింది. అంతేగాదు. ఆమె పూర్తి వివరాలు సేకరించింది. క్షణాల్లో అన్నీ తెలుసుకుని -

"మీకు చూపొస్తుంది. నాది హామీ" అని మా ఆవిడ చెప్పింది.

అంజనేయులు భార్య పేరు సులోచన. మా ఆవిడ మాటలకు చిన్నగా నవ్వి, "ఆయ నొచ్చాక చెప్పండి!" అని లోపలి కెళ్ళింది.

ఆవిడ వెంట మా ఆవిడా లోపల కెళ్ళింది, సొంత ఇంట్లోకెళ్ళినట్లు చొరవగా.

నేను డాబా వరండాలో చెక్కబల్ల మీద దిక్కులు చూస్తూ కూర్చున్నా.

ఇంటాయన అంజనేయులు ఎక్కడి కెళ్ళాడో, ఎప్పుడొస్తాడో తెలియదు. ఆయనొస్తేగాని మా ఆవిడ ఇక్కణ్ణుంచి కదలదు. పైగా సులోచనకు చూపు లేకపోవడం, ఆమెకు అపరేషన్ చేస్తే చూపు ఖచ్చితంగా వస్తుందని మా ఆవిడ నమ్మడం, ఇవన్నీ ఊహిస్తే... ఈ పూట ఇక్కడే ఉండాలి. తప్పదు!'

మధ్యలో మా ఆవిడ వచ్చి "ఏమండోయ్! సులోచనగారు వద్దన్నా వినకుండా, మన కోసం వంట చేస్తున్నది. ఆవిడకు చూపు లేకపోయినా ఇంట్లో ఏవి ఎక్కడున్నాయో తెలుసండీ. నాతో మాట్లాడుతూనే చకచకా వంట చేస్తున్నది" అని ఆశ్చర్యపోయి -

"ఓ అరగంటలో వంట అయిపోతుంది. ఆవిడ ఎంతో మంచిదండీ! నేను సాయం చేస్తానంటే, ససేమిరా ఒప్పుకోవడం లేదు. నాకో పీట వేసి బలవంతాన కూర్చోబెట్టి అన్నీ ఆవిడే చేస్తున్నది" అని జాలిపడి -

"చూశారుగా! ఆవిడెంత చక్కగా ఉందో! ఆ మొహం గమనించారూ! చంద్రబింబం. ఏమండీ! మీ చుట్టానికి తప్పక చెప్పండి. ఆవిడకు చూపొస్తుంది, కళ్ళకు అపరేషన్

చేయించమని. ఖర్చు ఎంతోగాదు. విజయవాడలో మా సుమిత్ర ఉంది గదా. నా క్లాస్‌మేట్. దానికి చెబితే వాళ్ళ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేస్తుంది. సాయంత్రం విజయవాడ వెళ్తాం గదా. దానికి చెప్తా - మా చుట్టాలే సాయం చెయ్యమని."

మా ఆవిడ ఉత్సాహం చూశాక, ఆవిడ ప్రయత్నాలు విన్నాక, నేనేం కాదనగలను? మా ఆవిడ కల్మషం లేని బోళామనిషి!

సిగరెట్ మీద సిగరెట్ కాలుస్తూ, గోడకు జారగిలబడి అలాగే నిద్రలో కొరిగా.

లోపల్నుంచి మాటలు, వీధిలో కారు చుట్టూ చేరిన పిల్లల అరుపులు, కేరింతలు, అడపాదడపా కాకి అరుపులు, ఎక్కణ్ణుంచో వినపడే పసిపాప ఏడుపూ, వీధికుక్కల కాట్లాటలు... అన్నీ లీలగా వినపడుతున్నాయి. మగతగా, అలసటగా నిద్రపోయా ఆకలీ, అలసటతో.

అలా ఎంతసేపు జరిగిందో తెలియదు!

"ఒరేయ్ భడవల్లారా వెళ్ళండి. మళ్ళీ ఇటువేపు వస్తే చంపుతా! దరిద్రపు గొట్టు వెధవల్లారా వెళ్ళండి. అంతా అలగా జనం. వీళ్ళ పొరుగు కాదుగానీ ఛస్తున్నాం" అన్న కేకలు, ఆ తరవాత ఇనుపగేటు కీచుమన్న శబ్దం... ఆ తరవాత నిశ్శబ్దం.. చెప్పు నాడా కింద రాళ్ళు నలిగి, కర్కశంగా వినపడే శబ్దానికి కళ్ళు తెరిచా!

సగం కాలిన శవంలా మనిషి. తీక్షణంగా చింత నిప్పుల్లా కళ్ళు, ఒళ్ళంతా స్ఫోటకం మచ్చలు, అగ్ని ప్రమాదానికో, భూకంపానికో మెలితిరిగిపోయిన ఇనుప స్థంభంలా ఆంజనేయులు -

"మీరు....."

నే సమాధానం చెప్పేలోపల, ఆయన భార్య సులోచన వచ్చింది. ఆమె వెంట మా ఆవిడ.

"మీ ఊరి వాళ్ళట. చూసిపోదామని వచ్చారు. మీరొస్తారు, ఉండమని అన్నా"

సులోచన మాటలో భయం ఉంది. వినయం ఉంది. తప్పు చేస్తే క్షమించమన్న అభ్యర్థన ఉంది.

ఆంజనేయులు క్షణంలో ప్రసన్నుడైనాడు. పెద్దగా నవ్వాడు - రేకు డబ్బాలో గులక రాళ్ళు పడ్డట్టు.

"మీరు పట్టాభిరామయ్యగారి కొడుకు గదూ. హైదరాబాదని విన్నా. మీ వివరాలన్నీ తెలుసు. మంచి పని చేశారు. మా ఆవిడకు చూపు మాత్రమే లేదనుకుని భ్రమ పడకండి. ఇంగిత జ్ఞానమూ లేదు. ఎవరింటికొచ్చినా పలకరించదు. మర్యాద చెయ్యడం తెలియదు... భయం, బిడియం" అని -

"ఏమే! వంటన్నా చేశావా! వాళ్ళు ఆగర్భ శ్రీమంతులు. ఈ కుచేలుడి ఇల్లు వెతుక్కుంటూ వచ్చారు. మన అదృష్టం" అని స్వగతం చెప్పుకుని -

వినయంగా, "క్షణం, నేను కాళ్ళు చేతులు కడుక్కుని వస్తా. ఎంగిలి పడదాం" అని ఆంజనేయులు ఉన్న కాసేపూ కూచిపూడి, కథాకళి నృత్యం, ఏకాభిపాత్రాభినయం చేసి వెళ్ళాడు.

మా ఆవిడ ఆంజనేయులు అవతారం, రూపురేఖలు, మాట తీరు చూసి నోట మాట రాక ఓ క్షణకాలం తరవాత తేరుకుని-

"ఈయన... ఆవిడ భర్తా... అలా ఉన్నాడేమండీ.. బకాసురుడి తమ్ముడు, ఘటోత్కచుడి అన్నలాగా. వామ్మో, వీడికి అంత సుకుమారమైన భార్యా? దున్నపోతుకు మల్లెచెండులా.."

మా ఆవిడ ఆశ్చర్యం, భయం, విభ్రమం, విస్మయాలతో చలనం లేకుండా ఉండి పోయింది, పాదరసంలా తిరిగే మనిషి!

మోదుగాకు విస్తర్లో భోజనం. పైగా పీట మీద కూర్చుని తినడం అలవాటు లేదు. కానీ తప్పదుగా.

భోజనం చేస్తున్నంత సేపూ ఆంజనేయులు మాట్లాడుతూనే ఉన్నాడు.

"ఉద్యోగం అంటూ ఏదీ లేదు గానీండి. సంపాదనకేం లోటు లేదండీ. దస్తావేజులు రాస్తా. భూమి కొలతలు వచ్చు. కోర్టు పనుల్లో నాకు సాటి లేరు. కొట్లో పద్దులు రాస్తా అదాయపు పన్ను లెక్కలు వచ్చు. ఇహ ఎన్నికలొస్తే నాయకులు మా ఇంటి ముందు పడిగాపులు పడి ఉంటారు" అని ఆంజనేయులు తన ప్రతాపం, గొప్పతనం, ప్రాముఖ్యం ... వివరిస్తూ...

"ఒసేవ్! గుడ్డిదానా! అలా నిలబడకపోతే అన్నయ్యగారికేం కావాలో అడుగు. అబ్బే! శుద్ధ మొద్దావతారమండీ. ఏంచేస్తా? నా మొహాన ఇలా రాసిపెట్టి ఉంది. ఈ జన్మకు ఇలా సరిపెట్టుకోవాల్సిందే. కూర వేయించుకోండి. మావన్నీ పల్లెటూరి వంటలు. పైగా, చూపు లేదుగదా. ఏదో వండిపారేస్తుంది, కళ్ళు మూసుకుతింటున్నా. మీరు అదృష్ట వంతులు. వదినగారు డాక్టరు. మీకేం రెండు చేతులా సంపాదన. హైదరాబాద్ వస్తుంటా. ఈసారి వచ్చినప్పుడు వస్తాలెండి. పరిచయమయ్యారుగా. నాకు ఇద్దరు మంత్రులు మాంఛి మిత్రులు లెండి..." - ఇలా ఆంజనేయులు సొత్కర్ష వింటూ భోజనం అయిందనిపించా!

మా ఆవిడ ఆయన మాటలూ చేష్టలూ చూస్తూ మధ్యమధ్యలో సులోచన ముఖ కవళికలు గమనిస్తూ ఉంది, కళ్ళింత చేసుకుని.

నేనూ, ఆంజనేయులూ బయట వరండాలోకొచ్చాక, మా ఆవిడా, సులోచనా భోజ నానికి కూర్చున్నారు.

నాకు అక్కణ్ణుంచి త్వరగా బయటపడదామని ఉంది. రాత్రికి విజయవాడ చేరి హాయిగా విశ్రాంతి తీసుకోవాలి.

వడగాలి వీస్తోంది. ఒళ్ళంతా చమట పట్టింది. త్వరగా మా ఆవిడ రత్నమాల వస్తే బావుణ్ణు. ఆంజనేయులు వడగాలి కంటే వేడిగా ఉపన్యాసం దంచుతున్నాడు.

"మా ఆవిడకు చూపు లేకపోవడం వల్ల, ఏ ఊరెళ్ళాలన్నా కుదరదండీ. ఎంత రాత్రయినా, ఇంటికి రావాల్సిందే. ఏ దొంగ వచ్చినా, కుక్క వచ్చినా దానికి తెలియదు. అమాయకపు పక్షి. దాని అందం చూసి చేసుకోలేదండీ. వాళ్ళ నాన్న బహు కుటుంబీకుడు. అక్కడ పుట్టింట్లో పూట గడవని స్థితి. మంచి బట్టకూ, తిండికీ మొహం వాచి ఉంది. గుడ్డిదైనా ఫర్వాలేదు. ఇల్లు కదలకుండా పడి ఉంటుందని చేసుకున్నా. పిల్ల నిచ్చిన మావగారు మళ్ళీ ఇటువేపు తిరిగి చూడలేదండీ. ఓ మంచీ లేదు, చెడ్డా లేదు. పండగ లేదు, పబ్బం లేదు. ఈ గుదిబండను, నా కంటగట్టి పరారు."

ఇలా అంజనేయులు చెబుతూనే ఉన్నాడు. నాకు తలనొప్పి, విసుగు, చిరాకు వచ్చాయి - ఆత్మస్తుతి, పరనింద వినలేక!

లోపల రత్నమాల, సులోచన తింటున్నారో, మాట్లాడుకుంటున్నారో తెలియదు ఎంతకూ ఊడిపడరు.

ఇంత వికృతాకారుడిని, కళ్ళున్న ఏ ఆడదీ చేసుకోదు... అది ఖాయం! కానీ అంజనేయులు తానేదో త్యాగం చేసినట్లు, ఓ అభాగ్యురాలి జీవితాన్ని ఉద్ధరించినట్లు మాట్లాడడం విచిత్రం గదూ!

అసలు ఈ అంజనేయులు తల్లి, పొత్తిళ్ళలో వీడిని చూసి, గుండెల కద్దుకుని, పాలిస్తూ, తను తల్లినైనందుకు గర్వించిందా? సంతోషపడిందా?

కన్నతండ్రి పున్నామ నరకం నుంచి తప్పించేందుకు కొడుకు పుట్టాడని, గర్వంగా తలెత్తుకు తిరిగాడా? ఏమో!

"మీ అన్నదమ్ములూ, అక్కచెల్లెళ్లూ..." అడిగా.

"ఎవ్వరూ లేరు - అయినా మా తండ్రి ఏం ఆస్తులు సంపాయించలా! చదువూ లేదు. ఉన్న పొలం కాస్తా అమ్మి బతికాడు. పొలం అయిపోయింది. ఆయనా పోయాడు. ఆయనకు అరవయ్యో ఏట నేను పుట్టానుట. అప్పటికి మా అమ్మకు నలభై నిండలా. ఇదిగో మా ఇల్లు, అరెకరాల పొలం నా స్వార్జితం. నా పెళ్ళయింది - అంతే! మా అమ్మ మంచాన పడ్డది. మా ఆవిడ పాదం అంత గొప్పది. ఏం చేస్తాం? అన్నీ గుండె రాయి చేసుకు భరిస్తున్నా. దీనికి పెళ్ళయి పదేళ్ళయినా పిల్లా పీచూ లేదు. చూపించని డాక్టరు లేడు. ప్రతివాడూ ఆవిడకు ఆపరేషన్ చేస్తే చూపొస్తుందంటారు గానీ, పిల్లలు పుడతారని చెప్పరు. ఏం డాక్టర్లో! ఏం ఆపరేషనో!"

మా ఆవిడ రూపాయంత కుంకుమ బొట్టు, మెడకు గంధం, తల్లో పూలు, కాళ్ళకు పసుపు, చేతిలో రవికలగుడ్డ, జామపండుతో బయటకు వచ్చి -

"పదండి వెడదాం!" అంది చాలా సీరియస్‌గా.

సులోచన గడపవతల నిలబడి, బుజాల నిండా కొంగు కప్పుకుని, వినమ్రంగా నిలబడి ఉంది.

"వస్తాం" అని చెప్పా.

ఆంజనేయులు వాకిలి దాకా వచ్చి, గారపళ్ళు ఇకిలిస్తూ, "వదినగారూ! మీ చెల్లెలికి చెప్పారా? ఆపరేషన్ చేయించుకో. చూపు వస్తుందని. నే చెబితే వినదండీ. నాకెందుకండీ అంటుంది. మొండిఘటం" అన్నాడు వీధంతా వినపడేలా!

రత్నమాల మాట్లాడలేదు. కనీసం అతని వేపు చూడనూ లేదు.

ఏం జరిగి ఉంటుంది?

కారు స్టార్ట్ చేసి, ఆంజనేయులుకు వెళ్ళొస్తా అన్నట్లు చెయ్యి ఊపా.

వీధిలో జనం మమ్మల్నీ, కారునీ ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"ఆయన మా అన్నగారు..." అన్న ఆంజనేయులు మాట, వీధంతా వినపడింది. తమ్ముడిని చూసి నవ్వుకున్నా. రత్నమాల గాలివానకు దెబ్బతిన్న పావురంలా సొక్కిపోయి, సోలిపోయి, కళ్ళు మూసుకుని, వెనక్కు జారగిలపడి ఉంది. ఆమె కళ్ళు ఏ క్షణంలోనైనా, వర్షించే మేఘంలా ఉన్నాయి.

కారణం తెలియదు.

రత్నమాల... అంతరాంతరాళాలలో మధనపడుతోంది. మనసు నిభాయించుకునేందుకు ప్రయత్నిస్తున్నది.

అది గమనించా!

సందులూ గొందులూ దాటి, దుమ్మూ ధూళితో కారు అమరావతి దాటి, కృష్ణ వెంబడే కరకట్ట మీదుగా వైకుంఠపురం వేపు పోతున్నది.

కారులో ఎ.సి. ఆన్ చేశా. పడవలా సాగిపోతోంది విజయవాడ వేపు.

రత్నమాల అంత నిశ్శబ్దంగా, స్థాణువులా ఉంటే నాకేం తోచలేదు. పసిపిల్లలా గెంతుతూ, కేరింతలు కొడుతూ ఉండే రత్నమాల కేమైంది?

కారు ఆపా.

ఓ క్షణం తరువాత, రత్నమాల కళ్ళు తెరిచింది, నవ్వింది.

"భయపడ్డారా? నాకేం కాలా!"

"రా, అలా కృష్ణలోకెళ్ళి మొహం కడుక్కో" అన్నా.

నా మొహం చూసి, ఎంతయినా డాక్టరు గదా, నా మనోభావాలు గ్రహించింది. ఛెంగున కారులోంచి దిగి, కృష్ణలోకి పరుగుతో వెళ్ళింది, చిన్నపిల్లలా.

కృష్ణానదిలో నీళ్ళు నిర్మలంగా ఉన్నాయి. పశ్చిమాన సూర్యుడు అలసిసొలసి తల్లి గర్భంలోకి వెడుతున్నాడు. లంకల్లోంచి పశువులు, వాటి కాపరులు వస్తున్నారు ఒడ్డుకు.

రత్నమాల మొహం కడుక్కుంది. దోసిటితో నీళ్ళు తాగింది. రెట్టించిన ఉత్సాహంతో వచ్చి కారులో కూర్చుంది.

"విజయవాడ ఎంత సేపట్లో వెడతాం?" అడిగింది.

చెప్పా, కారు వెడుతోంది.

రత్నమాల చెబుతుంటే, ఆశ్చర్యంగా వింటూ ఉన్నా.

"సులోచనకు కళ్ళు వస్తాయని తెలుసుటండీ.."

"మరెందుకు ఆపరేషన్ చేయించుకోదూ?"

"ఆంజనేయులు చేయించడు!"

"ఏం"?

"కన్నతల్లే, 'అమ్మా సులోచనా! వీడు పేగు తెంచుకు పుట్టాడు కనుక తల్లిగా పెంచుతున్నా. నీకు కళ్ళు లేవు. వాడి రూపం చూడలేవు. ఓ రకంగా ఇదో అదృష్టం నీకు. ఆ అదృష్టం చేజార్చుకోకు' అందిట!"

"నిజమా! ఆమె ఆడదేనా?"

రత్నమాల నవ్వింది.

"కన్నతల్లీ ఆడదే! కట్టుకున్న సులోచనా ఆడదే! 'అక్కా! ఆయన రూపం అందరూ చెప్పగా విన్నా. కొంత ఊహించుకున్నా తల్లే భరించలేని ఆయన రూపాన్ని, కళ్ళొస్తే చూసి భరించగలనా! లేదు. భరించలేను. నేను ఆత్మద్రోహం చేసుకుంటూ బతకలేను. అందుకే కళ్ళు... మాంగల్యం.. ఏది ముఖ్యం? ఎలా బతకాలి? అని చాలా రోజులు ఆలోచించా! అక్కా! నాకు వెలుగంటే తెలియదు. చీకటి తెలియదు. అందం, సౌందర్యం తెలియవు. అలాగే వికారంగా ఉండడం అంటే తెలియదు. ప్రపంచాన్ని, మనుషులను, వాళ్ళ హావ భావాలను, మనోనేత్రంతో చూడడం అలవాటు చేసుకున్నా. ఇదోరకమైన అనుభవం. నాకు చదువు లేదు. ఎవరి అండా లేదు. ఆయన ఎలా ఉంటేనేం? నాకు నీడ ఇచ్చాడు. చాలు. ఇంకా నాకేం కావాలి!" అని సులోచన మనోగతం చెప్పి, మా ఆవిడ నిట్టూర్చింది.

మరోమాట కూడా అంది మా ఆవిడ - "ఆవిడ విజ్ఞతకు సంతోషించాలో, మూర్ఖత్వానికి జాలిపడాలో తెలియడంలేదు!"

కొన్ని క్షణాలూ మా మధ్య నిశ్శబ్దం... సులోచన వ్యక్తిత్వాన్ని గురించి ఆలోచించా! అర్థం కాలేదు.

"ఇంతకూ సులోచన ఆపరేషన్ చేయించుకుంటానందా లేదా?" అడిగా.

"సులోచన సగటు అడదండీ! ఆంజనేయులుకు భయం - సులోచనకు చూపొస్తే తనను విడచి వెళ్ళిపోతుందేమోనని! అందుకే అతగాడు ఆమెకు ఆపరేషన్ చేయించడు. సులోచన చూపు కోసం భర్త ఆగ్రహానికి గురికాలేదు. ఉన్న ఇంటిని వదులుకోలేదు. ఆమె జీవితం అంతే!"

మా కారు పోతూనే ఉంది.

కృష్ణానది నిశ్శబ్దంగా ఎందరో జీవితాలను గమనిస్తూ తరాలుగా, యుగాలుగా అలా అలా సాగుతూనే ఉంది. •